

చాలామంది 'ఇంటిలెక్ట్యువల్స్'కి లాగే నాకు కూడా ఒక జబ్బు'ది అదేమిటంటే - ప్రొద్దుటే లేవగానే ఒక చేతిలో కాఫీ ఏంత అవసరమో, రెండో చేతిలో 'న్యూస్ పేపరూ' అంతే అవసరం. అప్పుడే రెండు చేతులూ బేలన్సు' అవుతాయ్ న్యూస్ పేపరు లేకపోతే కాఫీ కంఠం దిగదు. కాఫీ లేకపోతే వార్తలు బుఱ్ఱకెక్కవు. అయితే పేపరు చూడ్డం విషయంలో నాలో ఒక ప్రత్యేకత వుంది. మొదట్లో అందరిలాగే నేనూ మొదటి

పేజీలోని హెడ్ లైన్సు చదివేవాణ్ణి. క్రమంగా మొదటిపేజీ నింపివేసే దేశం లోని రాజకీయ వేత్తల 'రాజనీతి' పౌరుల ఘెరావోలు. క్రమశిక్షణారాహిత్యం. మత కల్లోలాలూ, వరదల బీభత్సాలూ, ప్లేన్ క్రాష్‌లో మృతులు, రైళ్ళ ప్రమా దాలూ మొదలైన యింకా ఎన్నో విశే షాలు ప్రకృతి మానవుడికి కల్గించే ఆపదలు, మానవుడే మానవుడికి చేసే ఘోరాలు చూస్తూంటే, రాత్రి నిద్రతో విశ్రాంతి పొంది ప్రశాంతంగా ఉన్న

ఒకరోజున ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో పడ్డ "హౌ మచ్ బెటర్ ఇటీజ్ టు ఎక్వైర్ విజ్డం దాన్ గోల్డ్! (How much better it is to acquire wisdom than gold!") అన్న బైబిల్ లోని సూక్తిని గురించి థింకిటోవర్ అన్నాడు కదా అని ఆలోచించేను థింకో వర్ చేసేనో ఓవర్ థింక్ చేసేనో చెప్ప లేను కాని, నేను అర్థం చేసుకున్న దేమి టంటే — "మానవుని అమూల్యమైన కాలాన్ని ధనసంపాదన కోసమే పూర్తిగా

---

**ఇల్లు కట్టిచూడు పెళ్ళి చేసిచూడు పాత సామెతకు ఇల్లు మార్చిచూడు స్టాండర్డాఫ్‌లివింగ్ అంతు తేల్చిచూడు అంటే అందులో వున్న స్టాండర్డాప్పాక్ట్ ఎంతవరకు?**

---

మనస్సు వికలమై 'అయ్యో! ఈ సంఘంలో మానవ మనుగడకే భద్రత లోపించి పోయిందే' అని బెంబేలు పడి పోయేవాణ్ణి. ఒక రకమైన మానసిక రుగ్మత ప్రవేసించి నా ఆరోగ్యమే క్షీణించే ప్రమాదం ఉన్నట్టనిపించింది వెంటనే పద్ధతి మార్చేను. ఇండియిన్ ఎక్స్‌ప్రెస్ చేతికందగానే సరాసరి ఎడి టోరియల్ పేజీలో ఉండే 'థింకిటోవర్' అన్న అంశం చూసేవాడిని ప్రపంచం లోని ఎంతోమంది మేధావులు చెప్పిన చక్కని సూక్తులు నన్నెంతగానో ఆక ర్షించుకునేవి.

వ్యయం చేసుకునే కంటే, విజ్ఞాన సము పార్జనంకోసం ఖర్చు పెట్టుకుంటే నిజ మైన ఆనందాన్ని పొందుతాం అని ఈ సూక్తి నా మనస్సుని బాగా ఆకట్టుకుంది విజ్ఞానసముపార్జనకి ముఖ్యసాధన మేమై ఉంటుందా అని ఆలోచించేను పుస్తక పఠనానికి మించినది లేదనిపించింది ఇం కప్పటినుంచి కనిపించిన పుస్తకం అల్లా చదవడం ప్రారంభం చేసేను. ఉద్యోగ రీత్యా నేను కాలేజీలో పెద్ద లైబ్రరీకూడా ఉంది కనక యింక పుస్తకాలకి కొదువ లేదు కదా!

అలా పుస్తక పఠన ప్రవాహంలో

పడి కొట్టుకుపోతున్న నేను ఒక రోజున ఒక అమెరికన్ ఇంజనీరింగ్ వ్రాసిన 'ఓన్ యువర్ హౌస్' అనే ఇంగ్లీషు పుస్తక పఠన ప్రారంభంలో కొచ్చి ఆగిపోయేను మొదటి రెండు వాక్యాలే నన్నెంతగానో ఆకర్షించుకున్నాయ్ అవేమిటంటే - ప్రతి వ్యక్తి యొక్క జీవిత కాలం అని రెండు భాగాలుగా విభజిస్తే బయట గడిపిన కాలంకంటే యింట్లో గడిపినకాలం చాలా ఎక్కువ అని 'స్టాటిస్టిక్స్' వల్ల తేలింది ఈ సత్యం గ్రహించిన అమెరికన్సు తమ ఆదాయంలో కనీసం నాల్గోవంతైనా ఇంటిమీద ఖర్చు పెడతారుట।

ఇంక నాకు చదువు ముందుకు సాగలేదు ముందు జరగబోయే విజ్ఞాన సముపార్జన ప్రయత్నానికి తాత్కాలికంగా స్వస్తి చెప్పడం తప్పలేదు ఈ విషయానికి సంబంధించిన ఆలోచనలతోనే నా మెదడు ఉక్కిరిబిక్కిరి గాసాగింది

మానవుడి విద్యావసరాల్లో 'గృహం' ఎంతో ప్రధానమైనది కదా। అంతటి ప్రాముఖ్యత కల యింటిపై నేను చూపే శ్రద్ధ, పెట్టేఖర్చు ఏపాటివి। ఈ విషయం యిన్నాళ్ళు నా బుర్రకి ఎందుకు తట్టలేదు। ఎంత అశ్రద్ధచేసేను। ఎంత అజ్ఞానంలో పడి కొట్టుకుంటున్నాను।।

ప్రస్తుత ఆర్థిక పరిస్థితిదృష్ట్యా,స్వంత యింటిని గురించి కల గనడంకూడా నా తాహతుకి మించినపని, కాబట్టి ఆ విషయంలో బెంగలేదు. కాని కనీసం ఉండే అద్దెయిల్లయినా అన్ని విధాలా హంగుగా ఉన్నది చూసుకోవడం నా కర్తవ్యం కాదూ॰ ఎల్లాగో అల్లా రోజు లెళ్ళిపోతున్నాయి కదా అని యిన్నాళ్ళు అంత పట్టించుకోలేదు అయినా నా పిచ్చికాని రోజు వెళ్ళకపోతే నా ఒక్కడి గురించీ కాలచక్రం స్తంభించి పోతుందా। తినీ తినక చెట్లక్రింద, రోడ్ల పక్కన 'పేవ్ మెంట్సు' మీద కాపురాలు చేసేవాళ్ళకి, పంచభక్ష్య పరమాన్నాలతో భోజనం చేస్తూ అంతఃపురాల్లో కులికేవాళ్ళకీకూడా కాలచక్రం సమానమైన వేగంతోటే పరిభ్రమిస్తుంది. కనక ప్రతివ్యక్తీ ఆలోచించుకోవలసిన విషయ మేమిటంటే- రోజు గడుస్తోందా లేదా అని కాదు, ఆ గడిచేరోజు ఏ స్థాయిలో గడుస్తోందీ అని దాన్నే కదా 'స్టాండర్డ్ ఆఫ్ లివింగ్' అంటారు।

నేనంటే పోనీ మొగాణ్ణి కనక॰ మొగాడు తిరక్క చెడ్డాడు అన్నారు కనక రోజంతా ఎంత తిరిగినా తిండికి, నిద్రకీ యింటికి చేరుకుంటున్నాను, కాని నా అర్ధాంగి మాటేమిటి? 'ఆడది తిరిగిచెడింది' అన్న పాత సామెతమీద యింకా ఎంతో నమ్మకం ఉంచుకుని పొద్దస్తమానమూ యింట్లోనే మగ్గిపోతుందే॰ ఆమె సుఖం కోసమైనా సదుపాయమైన యిల్లు తీసుకోవడం అవసరం. ఆ యిరుకు గదుల్లో



ఎల్లా కాలక్షేపం చేసిందిన్నాళ్లు. నాకు చాలా ఆశ్చర్య మేసింది. నా శ్రీమతి మీద సానుభూతిముంచుకొచ్చింది ఇంతకీ మా యింట్లో ఉన్న యిబ్బందు లేమిటి? నేను పట్టించుకోవడం మూలంగా యింత క్రితం వరకు నాకు తెలియలేదు. ఈ పుస్తక పఠనానంతరం నాలో అయిన జ్ఞా నో ద యం (తెలివి తెల్లవారడం) మూలంగా మా యింట్లో అన్నీ లోపల్లాగే కనిపించేయ్. చిన్నచిన్న లోపాలుకూడా భూతద్దాలలో చూపినట్టు చాలా పెద్దవిగా కనిపించ సాగేయ్. గదుల విస్తీర్ణం తగ్గిపోయినట్టనిపించింది ఇంటి పై కప్పు ఎగిరిపోయినట్టే, యిల్లే కంపించినట్లే అనిపించ సాగింది. ప్రకృతి ప్రసాదించే సూర్యరశ్మి. వెలుతురు. గాలి, నీరు కరువైపోయిన ట్టనిపించింది. (ఇంత క్రితం నీరు తప్ప మిగతా వాటి ఆవశ్యకత, ప్రాముఖ్యం మనస్సుకి పట్టనేలేదు.

ఇంటిని గురించి అప్పుడప్పుడు నా శ్రీమతి చేసే కంప్లెయింట్స్ గుర్తుకు రాసాగేయ్ వెంటనే యిల్లు మార్చడం చాలా అవసరం అనిపించింది.

నేను ఇల్లు మార్చాలి అని నిర్ణయిం చుకోడానికి ముఖ్య కారణం-నేను ఇంటికి నా జీతంలో నాల్గోవంతు కాదుకదా పదో వంతు కూడా ఖర్చుపెట్టడం లేదు

ఒక కాలేజీలో లెక్చరర్‌గా ఉంటూ సంఘంలో ఒక స్టేటస్ ఉన్న నేను, నెలకి ఏడు వందల రూపాయలు జీతం తెచ్చుకుంటూ (ప్రైవేట్ల సంగతి యిక్కడ ఉదహరించడానికి వీలులేదు) యింటికి కేవలం యాభై రూపాయలు మాత్రం అద్దె చెల్లిస్తున్నాను అంటే యింటి విషయంలో నా స్టాండర్డాఫ్ లివింగ్ ఎంత పూర్‌గా ఉందో వేరే చెప్పవలసిన పని లేదు.

శుభ్రమైన-డీసెంటు పోర్షను తీసుకో వలసిన అవసరం ఎంతైనా ఉంది. కనుక ఆ విషయమై ప్రయత్నించడం మొద లెట్టేను అద్దె నూటయాభై రూపాయల దాకా పెట్టదలుచుకున్నాను

*   *   *

రోజూలాగే ఆ రోజు కూడా కాలేజి స్టాఫ్‌రూమ్ క్లాసులకెళ్లే వాళ్ళతోటి,క్లాసుల నంచొచ్చే వాళ్ళతోటి క్లాస్ వర్కు-లేకుండా కాలక్షేపం కోసం కబుర్లు చెప్పే వాళ్ళతోటీ రైల్వే స్టేషన్‌లా చాలా కోలాహ లంగా ఉంది, అంట్లు మనిషి ఎగ్గోట్టడం దగ్గరనుంచి అంతర్జాతీయ రాజకీయాల దాకా చర్చలు కొనసాగుతున్నాయి నేను మాత్రం అవసరమైతేనేగాని వీటి జోలికి పోను నాకు పనికొచ్చే విషయమేమైనా ఉంటే వెంటనే ఉపయోగించుకుంటాను,

మాటల సందర్భంలో లెక్కల డిపా ర్టుమెంటు లక్షణరావు వాళ్ళ యిల్లు ఖాళీ చేస్తున్నట్టు చెప్పేడు ఆ యిల్లు నేనిది వరకు చూసేను ఫ్రంట్ వరండా, డ్రాయింగు రూము, బెడ్ రూమ్, కిచన్, ఎటాచ్‌డ్ బాత్ అండ్ లావెట్రీలతో చాలా డీసెంటుగా ఉంటుంది సెపరేట్ దాబా ఒక ఫామిలీకీ చాలా బాగుంటుంది

"ఇల్లు ఎందుకు ఖాళీ చేస్తున్నావు?" అనడిగేను లక్షణరావుని.

"వచ్చిన మొదట్లో అప్పట్లో వేరే యిల్లు దొరక్క తాత్కాలికంగా చేరేను కాని అంత అద్దె నేను భరించలేను నా ప్రాణానికి ఒక వైట్‌ఎలిఫెంట్‌లా తయారయింది" అన్నాడు

లక్షణరావుకి నాకంటే కొంచెం జీతం తక్కువ,

అదే యిప్పుడు నాకు వరంలా పరిణ మించబోతోంది.ః

"మీ యిల్లు ఖాళీ చేస్తే నే నొద్దామను కుంటున్నాను, నాతో చెప్పకుండా మరి ఎవళ్ళకీ యిల్లు పోనీకు" అన్నాను

అద్దె విషయంకూడా అడిగాను అది ముఖ్యం కదా!

"ఇంత వరకు నేను నూట ముప్పై

యిచ్చాను. నేను ఖాళీ చేస్తే నూట యాభై కిమ్మని మా హౌస్ ఓనర్ రాసేడు'' అన్నాడు.

నేననుకున్న ప్రకారంగానే వస్తోంది ఎలక్ట్రిసిటీ చార్జస్ కలిపినా నా జీతంలో నాల్గోవంతుకంటే ఎక్కువకాదె.

ఒక్కక్షణం అమెరికన్స్‌తో సమాన మైన స్టాండర్డ్ ఆఫ్ లివింగ్ ఉన్నట్టని పించి నా మనస్సు గర్వంతో తొణికిస లాడింది.

ఈ శుభ సమయంలో నా మనస్సు లోని ఆనందంలో పాలు పంచుకునే నా అర్ధాంగి లేనందుకు ఎంతో విచారించేను. ఆవిడగారు ప్రస్తుతం మా ఇంట్లోవున్న ఇరుకు చాలదన్నట్లు ఇంకా ఇరుకు చేయ డం కోసం పుట్టింటి కెళ్ళింది

తిధి, వారం, వర్జ్యం, తార, శూల అన్నీ చూపించుకుని ఒక శుభముహూర్తాన నే నొక్కడినీ వెళ్ళి కొత్త యింటిలో ప్రవేశించేను అయితే పాతయిల్లు వదిలే టప్పుడు మాత్రం చాలా కష్టంగానే తోచింది ఆ యింటి యజమాని వెంక ట్రామయ్యగారు ఆయన సతీమణి మాణి క్యమ్మగారు యింత కాలం 'మ్మల్ని కన్న బిడ్డలకి మళ్ళీనే చూసేరు. వాళ్ళలో ఎంత ఆత్మీయత ఉన్నా, ఇంటిలో హంగు తక్కువగా ఉండడం మూలంగా నేను మరి యిల్లు మారక తప్పదుకదా! తల్లి దండ్రులని విడిచి అత్తవారింటి కెళ్ళే కుమార్తెలా, ఉద్యోగానికి దూరదేశాలకి వెళ్ళే కుమారుడిలా ఆ యిల్లు వదలి వెళ్లే నే కాని, వాళ్ళ మీద యుద్ధం ప్రకటించి మాత్రం కాదు.

కొత్త యిల్లు ఎంత నదుపాయంగా ఉన్నా, నే నొక్కడినీ ఉంటూండడం మూలంగానూ, నాకు బిక్కు బిక్కు మంటూ ఉండేది.

ఆ యింట్లో కొత్తగా నాకు కలిగిన, కలగబోయే హంగుల గురించి రంగు రంగుల కలలతో ఊహాగానాలు చేసు కుంటూ కాలక్షేపం చెయ్యడం మొద లెట్టేను.

కొత్త యింటిలో ముఖ్యంగా నేను చెప్పుకుని సంతోషించదగ్గ సుగుణాలు రెండున్నాయి

ఒకటి- పడకగది మిగతా గదులకి సంబంధం లేకుండా ఒక ప్రక్కగా ఉంది

---

జడ్జి నువ్వు నీ భర్త దగ్గరనుండి విడాకులెందుకోరుతున్నావ్?
ముద్దాయి (భార్య) నా భర్త తను వ్రాసిన చెత్త కథలన్నీ చదివి వినిపిస్తుంటే వినలేక చస్తున్నా!

—పి. యస్. ప్రకాశరావు, బరంపురం-2

దాని వల్ల అంత చెప్పుకో తగ్గ సుఖం ఉందా అని మీరనుకోవచ్చు డ్రాయింగ్ రూమ్, బెడ్ రూమ్, కిచన్ ఈ మూడూ ఒకే లైనులో ఉంది. ప్రక్కన సందు కూడా లేకుండా ఉన్నవాటాలో ఉండే వాళ్ళకే అందులో సుఖం అర్థమౌతుంది నేను యిది వరకు ఉన్న పోర్షన్ అటు వంటిదే. పడకగది త్రిశంకు స్వర్గంలా మయంగా ఉండిపోతుంది మా యిల్లు వచ్చిపోయే అతిథులకి ఎప్పుడూ నిలయం గానే ఉండేది డ్రాయింగ్ రూమ్‌లో రాత్రిళ్ళు పడుకున్న అతిథులు ఒక రాత్రి వేళ ఏ అవసరమైనా వచ్చి దొడ్డిలోకి వెళ్లాలంటే పడక గదిగుండా వెళ్లాల్సిందే కదా! అవసరమైన వాళ్ళు నిర్మొహ మాటంగా లేపితే మేము యిబ్బంది పడే వాళ్ళం 'మమ్మల్ని యిబ్బంది పెట్టడం ఎందుకులే' అని వాళ్ళు మొహమాట పడితే వాళ్ళు ఇబ్బంది పడే వారు అలా వారు ఇబ్బంది పడిన విషయం మాకు తెలిస్తే 'అయ్యో! మన అతిథులకి యిబ్బంది కలిగిందే!' అని మళ్ళీ మేమే మనసులో బాధపడే వాళ్ళం. ఇప్పుడీ కొత్తయింట్లో అలాంటి బాధలుండవు.

నేను ముఖ్యంగా. వ్యక్తిగతంగా సం తోషించే మరొక విషయ మేమిటంటే - ప్రైవసీ

పాత యింట్లో మా వాటాలో ఉండే గదుల్లోంచి యింటివాళ్ళ గదుల్లోకి గోడ ల్లోకి తలుపు లుండేవి.

ఆ తలుపులెప్పుడూ మూసేవున్నా వాటి వల్ల యిబ్బందులు మాత్రం తెరుచుకునే ఉండేవి.

రెండు తలుపు రెక్కల మధ్య నిటా రుగా సందు చిన్నదిగా ఉంటే ఉండి ఉండవచ్చు. నేనంతగా పరిశీలించ లేదు కాని, లేదనే అనుకుంటున్నాను.

కాంతి కిరణాలు తిన్నగానే ప్రసారం చేస్తాయి కనుక, దృష్టిరీత్యా ఆ తలు పుల వల్ల అంత ప్రమాదం లేకపోవచ్చు వచ్చిన చిక్కల్లా శబ్ద తరంగాల తోనే 'కాన్స్టిట్యూషన్'ని కూడా లెక్క చెయ్యని నియంతలా వాటి ప్రయా నికో రూలూ, రైమూ లేదు.

మా పడకగదిలో సూది కింద పడితే అవతల గదిలోకి వినిపిస్తుంది.

దాంతో, పడక గదిలో ఉన్నంతసేపూ మౌనమే శరణ్యమయ్యేది శారీరక-మాన సిక ఆరోగ్యాలకి మౌనం ఎంత మంచి ఔషధమైనా, కష్టసుఖాలు కాస్సేపు చెప్పు కునే పడక గదిలోనే అవలంబించాలంటే ఎంతకైనా కష్టంగానే ఉంటుంది కదా!

ఈ కొత్త యింట్లో ఆ బాధ లేదు. రాత్రి తెల్లవార్లూ ఎంతగా మాట్లాడుకున్నా, పోట్లాడుకున్నా ఎవరికి వినిపించదు మన యింట్లో వాళ్ళకి తప్ప

ఈ రెండు హంగులువల్ల నాలో కల్గినే

రెట్టించిన ఉత్సాహంతో శ్రీమతి రాక కోసం ఎదురు చూస్తున్నాను.

తీరా ఆ శుభ ఘడియలు వచ్చిన తరువాత—నా శ్రీమతికి నచ్చినట్టు లేదు కొత్తగా కట్టించిన బిల్డింగ్ ఇన్స్పెక్షన్‌కి "ఛీఫ్ ఇంజనీర్" వచ్చినట్టుంది తనకి అనుకూలంగా ప్రవర్తించని 'సబార్డినేట్'లో ఏదో లోపాలు వెతకడమే ముఖ్యంగా భావించే ఆఫీసర్‌లా, బిల్లుని కనీసం చూడనైనా చూడకుండా 'ది బిల్ ఈజ్ రిటర్న్డ్ విత్ ది ఫాలోయింగ్ రిమార్క్స్' (The bill is returned with the following remarks) అని మొదటే ప్రారంభించి బిల్లులో లోపాలు వెతికే ఎక్కౌంటెంట్‌లా ఇంటి లోకి యింకా పూర్తిగా ప్రవేశించకుండానే నా శ్రీమతి యింటిలో లోపాలు ఏకరువు పెట్టడం ప్రారంభించింది.




శ్రీకృష్ణుడిలో లోపాలు చూపెట్టే శిశుపాలుడిలా, నేను కోరి కొత్తగా ప్రవేశించిన నా నూతన గృహంలోని లోపాల దండకం చదవడం మొదలెట్టింది. అవన్నీ యిక్కడ ముచ్చటించుకోవడం ప్రారంభిస్తే, ఒక పెద్ద సీరియల్ అయ్యే ప్రమాదముంది కనక అందులోని ఆణి ముత్యాలు మాత్రం కొన్ని ఉదహరించుకుందాం.

ఇల్లు ఎక్కడో అడివిలో విసిరి కొట్టినట్టుంది. ఘడియలూ, బోల్టులూ లేవుట (అసలు లేకపోలేదు. గట్టి లేవు కనక ఉన్నట్టు కాదుట) ఇంటికి మూడువైపుల మాత్రమే కాంపౌండ్ వాల్స్ ఉన్నాయిట. (నల్లరేగడి నేలలో అసలు 'కాంపౌండ్ వాల్స్' అంటూ కట్టడానికి యజమాని సాహసించినందుకు సంతోషిస్తున్నాను!)

నాలుగోవైపు గోడలేని కారణంగా దొడ్లో పందులు, కుక్కలు, కోళ్లు మొదలుగాగల సమస్త జంతు జాలము స్వైర విహారము చేస్తాయిట (దురదృష్టవశాత్తు అప్పటికి వాస్తవంగా చేస్తున్నాయి). అమ్మవారి సింహాసనం పెట్టుకుందుకు

ప్రత్యేకంగా ఒక గూడు లేదుట.. ముఖ్యంగా శివుడి స్థానమైన ఈశాన్యమూల లెట్రిన్ ఉందిట. (ఈ వాస్తు శాస్త్ర పరిజ్ఞానం నాకు ఇసుమంతకూడా లేకపోవడం గొప్ప చిక్కే తెచ్చిపెట్టింది)


ఇంకా ఎన్నో లోపాలు ఏకరువు పెట్టుకుంటూ పోయి, ఇంతకంటే చచ్చు కొంప ఈ ఊళ్ళో మీకు దొరకనే లేదా? అసలు నాకు చెప్పా పెట్టాకుండా యిల్లెవరు మార్చమన్నారు తగుదునమ్మా అని?" అన్న క్వొశ్చన్ మార్కు-తో తన భావోద్వేగానికి ఫుల్‌స్టాప్ పెట్టింది మొదట్లో నిందాస్తుతి కాబోలు అనుకున్నా కాని, నిజంగా నిందే అని తేలిన తరువాత, ఎవరి సుఖం కోసం నేనింత కష్టపడి, ఎక్కువ అద్దె భరించడానికి ఇష్టపడి యిల్లు మార్చేనో, ఆ వ్యక్తి నోటంట వచ్చిన మాటలు వినగానే నేను నిలువునా నీరుగారి పోయేను తన పుట్టిన రోజు పండుగకి నేను బహుమతిగా తీసికెళ్ళే కంచి పట్టు చీరలూ, నెక్లెస్‌లూ నచ్చలేదని నా ముఖాన కొట్టినా, నుదుటి మీద చిన్న బొప్పి కట్టేదేమో కాని, ఇప్పుడు నా మనస్సులో కలిగిన గాయం చెప్పరానిది వర్ణించడానికి అలవి కానిది

అనుకోకుండగా నా శ్రీమతివల్ల నాకు కలిగిన అవమానాన్ని, 'రియలిస్టిక్ వ్యూ' అర్థం చేసుకోడానికి ప్రయత్నించేచు ఆమె నా అర్ధాంగి సహధర్మచారిణి అందునా సమాన హక్కుల కోసం స్త్రీలు పోరాడి సాధించుకుంటున్న ఈ రోజుల్లో పురుషుడివల్ల స్త్రీకి ఎట్టి అన్యాయం జరగడానికి వీల్లేదు ఆలు-మగల దాంపత్య జీవితానికి ఇరువురూ కలిసే ఎన్నో (వీలైతే అన్నీ) 'డెసిషన్సు' తీసుకుంటారు అల్లాంటిది ముఖ్యమైన ఇంటి విషయంలో నా శ్రీమతి అంగీకారం ముందుగా పొందకపోవడం నా పొరపాటేననీ, అందుకు నా శ్రీమతి దృష్టిలో నేను క్షంతవ్యుణ్ణి కాననీ అర్థం చేసుకున్నాను.

ఆలు మగల మధ్య అభిప్రాయ భేదాలుండడం సహజం కనుక యింటి విషయంలో నా శ్రీమతికి నచ్చకపోవడంలో ఆశ్చర్యం లేదు

ఆమె దృష్టిలో వెలయాలికి పెట్టిన సొమ్మెంత నష్టమో, గోడకుకొట్టిన వెల్ల కూడా అంతేనని అలాంటప్పుడు కేవలం ఇంటి అద్దెమీద నెలకి నూట యాభై వెచ్చించడం ఆమెకు సుతరామూ ఇష్టం లేదు సంవత్సరం అద్దెపెడితే పన్నెండు కాసుల బంగారంతో ఏ వరహాల పేరో పలక సరులో, ఇంకా ఏవో ఏవో నగలు చేయించుకుని ఒంటి కెట్టుకోవచ్చును కదా అని ఊహ.

ఒంటికి పెట్టుకుంటే, ఆ బరువు మొయ్యడంలో ఆనందం పొందేది తను ఒకర్తే ననీ, ఇంటి కెట్టుకుంటూ ఆసుఖం అందరూ పొందవచ్చుననీ, నే నెంత నచ్చ చెప్పడానికి ప్రయత్నించినా,




బంగారం విషయంలో నిర్దుష్టమైన అభిప్రాయాలతో కూడిన ఆమె వ్యక్తిత్వాన్ని నా వైపు ఎంత మాత్రమూ తిప్పుకోలేక పోయేను.

తల్లిదండ్రులకంటే ఎక్కువగా చూసుకునే మా పాత యజమానులైన వెంకట్రామయ్య దంపతుల్ని విడిచి ఒంటరిగా యీ కొత్తయింట్లోకి రావడం ముఖ్యంగా అన్నింటికంటె ఆమెకి ఎక్కువ కష్టం కలిగించింది. ఆ విషయంలో కూడా ఏదోలా అనునయించడానికి ప్రయత్నం చేసేను.

ఏడుస్తూ వ్యవసాయంచేస్తే కాడి,ఎడ్లు దొంగల పరమైనట్టు, ఈ కొత్త ఇంట్లో ఈదురోమని కాపురం ప్రారంభించిన నా శ్రీమతికి ముఖ్యంగా అవసరమయ్యే పని మనిషి దొరకలేదు. అంట్లు తోమడానికి ఆ చుట్టుపట్ల ఎంతమంది నడిగినా 'తలకి మించిన బరువు మోస్తున్నాం' అనేవాళ్లే.

గాంధిమార్గమైన 'బేసిక్ ట్రెయినింగ్' అయినా కనీసం పొందకపోవడంవల్ల, 'పాత్ర ప్రక్షాళన' తెచ్చిపెట్టిన శిక్షవల్ల ఆమె పరిస్థితి పిచ్చెక్కిన కోతికి ముల్లు గుచ్చుకున్నట్టయింది.

ఎటువంటి కట్టడమైనా, దాని బరువు పునాదులద్వారా చివరికి భూమాతకే ఏ విధంగా తప్పనిసరిగా సంక్రమిస్తుందో అదేవిధంగా, శ్రీమతి చికాకులు, కోపం. ఉశుకుమోత్తనం పిల్లల నడ్డిమీదకీ నేలటపాకాయల రూపంలో వినేవాళ్ళ వీనులకి విందు చేసేవి.

దైవ స్వరూపులైన పసిపిల్లలికి జరిగే అన్యాయం చూసి సహించలేక పిల్లల ఒంటిమీద చెయ్యివెయ్యడానికి వీలులేదని గట్టిగా శాసించేను.

దానితో ఆ విసురంతా నా మీదకి మళ్ళించింది. ఎంతకైనా హైందవ స్త్రీ కనుక, భర్తనైన నన్ను చెయ్యి చేసుకో లేదు కనుక తన అక్కసంతా నోటి ద్వారా వెళ్ళ గ్రక్కేది

గతుకుల రోడ్లమీద సాఫీగా పోవా లంటే కారుకి అవసరమైన స్ప్రింగ్ లాగా మా సంసారం ఈ గతుకుల పరి స్థితుల్లో సాఫీగా సాగి పోవడం కోసం నేను ఒక స్ప్రింగ్‌కావలసి వచ్చింది.

"ఎంతో మంచివాళ్ళు. సందడైన వాళ్ళు, కలివిడైన వాళ్ళనీ విడిచి మూల బోరుకొట్టి చస్తున్నాను. ఇంటికి తాళం వేసి ఎక్కడికైనా వెడదామంటే వీలు లేదు. ఈ ప్రాంతంలో దొంగతనా లెక్కువంటున్నారు. వచ్చే నెల్లో మా చెల్లెలి పెళ్ళి కెళ్ళాలి కూడాను. ఎలాగో ఏమిటో." అంటూ బాధపడేది.

మా కొత్త యిల్లు చూడ్డానికొచ్చే బంధు వర్గంలోని ఆడంగులు "యిల్లు మాత్రం చూడ్డానికి చాలా బాగుంది కాని ఒక్క రిత్తిపీ ఉండాలంటే భయం కాదుటే? మీ ఆయన ఏ ఊరేనా వెడితే పిల్లలతో నువ్వొక్కర్తివీ ప్రాణాలు గుప్పిట్లో పెట్టు క్కూర్చోవాలి" అంటూ పిరికి మందులు నూరిపోసి మరీపోయేవారు.

పిరి అబ్బకపోయినా చీర అబ్బు తుందట. శ్రేయోభిలాషుల నోటంట వచ్చే మంచి మాట జరగక పోయినా చెడ్డమాటకి మాత్రం తథాస్తు! అంటారు కాబోలు ఆ తరుణంకోసం వేచికూర్చొనే తథాస్తు దేవతలు.

ఒక రోజున జరీ అంచు కొత్త చీర దొడ్లో తీగమీద ఆరబెట్టి వంటింట్లో పని చూచుకుని. ఒక అరగంట పోయిన తర వాత వచ్చి ఆ అరగంట కాలంతోపాటు దొడ్లో చీర కూడా పోయిందని గ్రహిం చింది నా శ్రీమతి.

ఆమెను ఒక ఒంటెతో పోలిస్తే, ఈ సంఘటనని 'లాస్ట్ స్ట్రా ఆన్ ది కేమెల్స్ బ్యాక్' అని చెప్పొచ్చు.

ఈ దెబ్బతో దొంగల భయం ఆమె మనస్సులోని ధైర్యాన్ని పూర్తిగా దొంగి లించేసింది. "వెంటనే యిల్లు మార్చె

---

భర్త: చూడు, బాబు ఏడుస్తున్నాడు. కాస్త ఊరడించి పడుకోబెట్టు.
భార్య: బాబు ఏడ్వవలసిన అవసరం లేదండీ. నేను పాడుతున్నాను.

—పి. యస్. ప్రకాశరావు, బరంపురం-2.

య్యేంది" అని అల్టిమేటమ్ కూడా యిచ్చింది.

ఎక్కడో ఒకచోట ప్రశాంతంగా కాలక్షేపం అయిపోతుంటే 'స్టాండర్డాఫ్ లివింగ్' అంటూ ఒక కొత్త సమస్యని సృష్టించుకుని కొరివితో తలగోక్కున్నా నేమిటా అనిపించసాగింది నాకు.

రోజూ రెండుపూట్లా 'అంట్లు' ముందేసుకుని కూర్చున్న నా అర్ధాంగిని చూస్తోంటే "ఇదేనా నే నిక్కడి కొచ్చి బావుకున్న స్టాండర్డాఫ్ లివింగ్!' అనిపించేది. నా మనస్సు ఎంతగానో క్షోభించేది.

మాన్యువల్ లేబర్ కరువైన కొలదీ, అది దేశాభ్యుదయ చిహ్నమేనని అందుకు విచారించకూడదనీ, జీవనప్రమాణం పెరిగిందని గర్వపడాలనీ క్లాసులో లెక్చర్ అంటే యిచ్చేను. కాని, దాని విషయం నాదాకా వస్తే నే కాని తెలియలేదు. పని మనిషి లేక ఎంతైనా యిబ్బంది పడుతున్నాం.


"ఇల్లు మార్చవలసిందే" నని శాంత ఎంత అల్టిమేటమ్ ఇచ్చినా, నా మనస్సుకి నాకు యింకా యిష్టం లేదు.

పరిస్థితులు చక్కబడకపోతాయా! పని మనిషి దొరక్క పోతుందా! ఇంటికి మైనర్ రిపెయిర్స్ చేయించక పోతామా! (ఈ విషయమై ఓనర్‌కి ఉత్తరంకూడా రాసేను.)

నాలో ఎక్కడో ఆశాకిరణం మినుకు మినుకు మంటోంది. ఎంతకైనా మానవుడు ఆశాజీవి కదా!

ఒకరోజు సాయంకాలం భోజనానంతరం. బజారు కెడదామని ఫ్రంట్ యార్డులో తాళమేసి ఉన్న సైకిలు దగ్గిర కొచ్చిచూస్తే డైనమో బల్బూ, బెల్‌కి ఉండే స్టెయిన్‌లెస్ స్టీల్ కప్పూ లేవు!

భార్యాభర్తల మధ్య రహస్యా లుండకూడదని వివాహ సమయంలో అగ్ని సాక్షిగా చేసిన ప్రమాణం గుర్తున్నా. ఈ దొంగతనం గురించి చెబితే, ఆమె ప్రస్తుత పరిస్థితుల్లో వేసే అక్షింతలభారం



మోసేశక్తి లేక చెప్పలేదు.

నే నెంత స్ప్రింగులా ఉందామని ప్రయత్నించినా, ఆ స్ప్రింగుకు కూడా కొంతకాలానికి 'ఎలాస్టిసిటీ' పోతుంది కదా! ఇప్పుడు నా పరిస్థితీ అలాగే ఉంది.

నా స్వానుభవం నా శ్రీమతిచ్చిన అల్టిమేటమ్ గురించి నేను సీరియస్‌గా ఆలోచించేట్టు చేసింది.

'స్వర్గసీమ' అని భ్రమపడి ఈ ఇంట్లోకి వస్తే, అది 'నరకరూపం'లా తయారయే ప్రమాదం కనిపించడంతో, ఇంక లాభం లేదని ఇల్లు మార్చెయ్యడానికి కంకణం కట్టుకున్నాను.


ఇంత కాలానికి నాలో మళ్ళీ ఒక సత్సంకల్పం కలిగినందుకు నా శ్రీమతి లాటరీలో లక్షరూపాయలు వచ్చినంతగా సంతోషించింది.

రోజూ సాయంకాలం కాలేజీ అవగానే ఇళ్ళవేటలో పడ్డాను "కొత్త యిల్లు మూడునాళ్ళ ముచ్చటేనా??" అని కొందరు నా మిత్రులు ధైర్యం ఉన్నవాళ్ళు ప్రత్యక్షంగా, ధైర్యం లేనివాళ్లు పరోక్షంగానూ నన్ను హేళన చెయ్యడం కూడా మొదలెట్టేరు. కాని కార్యదక్షుడనైన నేను అవేమీ లక్ష్యపెట్టక అకుంఠిత దీక్షతో నా కార్యక్రమం కొనసాగిస్తున్నాను.

ఊళ్లో సందులు, గొందులు, కిళ్ళీ బడ్డీలు, హెయిర్‌కటింగ్ సెలూన్లు, లాండ్రీలు, మొదలైన వాటిపేర్లు నాకు బాగా నలుగుతున్నాయి. కాళ్ళు సాగుతున్నాయి. జోళ్ళు అరుగుతున్నాయి, ఊళ్లో ఆ బాలగోపాలంతో పరిచయాలు కలుగుతున్నాయి గంటలు, రోజులు, వారాలు, నెలలూ కూడా జరుగుతున్నాయి. నా ఒంట్లో జవసత్త్వులు ఉడుగుతున్నాయి కాని, నాకు నచ్చిన యిల్లుమాత్రం దొరకడంలేదు. నాకు, నా శ్రీమతికీ కూడా నచ్చేయిల్లు అసలు దొరకడంలేదు.

నేను యింటికోసం తిరిగిన తిరుగుడులో ఏ తండ్రి అయినా తన కుంటి కుమార్తెకి కూడా పెళ్ళికొడుకుని వెతికి ఉండకలిగేవాడు. పోనీ ఆ పనైనా కలిసొస్తుందేమో అంటే యింకా నా పిల్లలు (కుంటి అనుకునేరు! రత్నాల్లా ఉంటారు) పెళ్ళికి ఎదగాలేదు, అందుకు కావలసిన సొమ్ము నేనింకా కూడబెట్టాలేదు. అయినా, ఎదిగేక నా పిల్లలు పెళ్ళి చేసుకుంటారో, లేదో తెలియదు. అసలప్పటికి పెళ్ళిళ్ళనేవి ఉంటాయో ఉండవో తెలియదు. కనక ఎప్పటి విషయాన్ని గురించో యిప్పుడు కలిసి రాలేదనుకోడం అవివేకం.

నూతన గృహాన్వేషణలో నిమగ్నుడనై ఉన్న నాకు తెలియకుండానే రెండు నెలలు గడిచేయి. నా కృషిమాత్రం శుక్లపక్షం వెన్నెలలా, జూదంలో ఓడిపోయే వాడి పట్టుదలలా దినదినాభివృద్ధి చెందు



తోందేకాని ఎంత మాత్రం లోపం జరగ డంలేదు

ఈ రెండు నెల్లలోనూ నా శ్రీమతి పరిస్థితిలో కొంత మార్పు రాసాగింది. ముఖ్యంగా చెప్పుకోతగ్గవి రెండు. మొద టిది పనిమనిషి కుదరడం అసలు జీవి తమే ఒకజూదం ఒకళ్ళకి కలిగిననష్టమే మరొకరికి సుఖం

మా పక్కింటి కాంతమ్మగారి పని మనిషి యొక్క అప్పగారైన అప్పలమ్మ భర్త లారీ ప్రమాదంలో మరణించగా, అప్పలమ్మకి నిలువ నీడలేక స్వగ్రామం వదలి చెల్లెలి యింటికి ఆశ్రయించి వచ్చింది. రెక్కాడితేనే కాని డొక్కాడే విధానం లేదు కనుక మా యింట్లో పని మనిషిగా కుదిర్చింది ఆచెల్లెలు. ఆ విధంగా అప్పలమ్మపాలిట శాపం నా శ్రీమతి పాలిట వరంలా పరిణమించింది।

రెండో విషయమేమిటంటే మాదొడ్లో నాలుగో పక్క గోడ వెలిసింది మా పక్కింటివాళ్ళబ్బాయి పి డబ్ల్యు డిలో సూపరువైజరు అనుకోకుండా పది, పది హేను బస్తాల సిమెంటు కలిసొస్తే ఎప్పటికైనా వాళ్లు పెట్టుకోవలసిన గోడేకదా అని గోడ కట్టించేరు మృగ, ఖగ సంచారానికి అంతరాయం కలగడంతో దొడ్డి బాగుచే యించి కిచన్‌గార్డెన్ కూడా తయారు చేసు కున్నాం.

మా యింటికి మరొకప్రక్కన ఉన్న రైతులగేదె ఈనడం మూలంగా వాళ్లు మాకు మట్టి ఊడల్లాంటి చిక్కని పాలు స్నేహధర్మంగా పోయడం ప్రారంభిం చేరు.

ఎదురుగా ఉన్న శాస్త్రిగారి చెల్లెలుతోటి

ఆ పక్కనే ఈ మధ్యనే దిగిన అరవవాళ్ళ 'మామి'గారితోటే నా శ్రీమతికి స్నేహం కలిసింది మాటల సందర్భంలో'' అన్నయ్యగారు ఊళ్లోలేకపోతే మీరేమీ భయ పడనక్కరలేదు నేనొచ్చి మీకు సాయం పడుక్కుంటాను లెండి'' అంటిట శాస్త్రి గారి చెల్లెలు

కొత్తగా వచ్చిన అరవావిడకూడా "మామీ! మామీ!!" అంటూ అస్తమానం నా శ్రీమతి దగ్గరే ఉంటుంది ఆవిడకి తెలుగు కొత్త. మేము కొంతకాలం ఉద్యోగరీత్యా మద్రాసులో కాపురం వెలగ బెట్టడం మూలంగా నా శ్రీమతి కూడా వచ్చీరాని తమిళం మాట్లాడుతుంది, ఆ మిడి భాషాజ్ఞానమే ఈ మామీలిద్దరి మధ్యా అనుబంధం ఏర్పరిచింది

మరొక విషయమేమిటంటే మా కాలేజిలో పెద్ద లైబ్రరీ ఉందికదా అని నా జ్ఞాన తృష్ణలో ఎన్నో కొత్తపుస్తకాలు తెచ్చి ఇంట్లో ఒక చిన్నసైజు లైబ్రరీ నేను నెలకొల్పితే, నా శ్రీమతి దాన్ని ఒక మొబైల్ లైబ్రరీగా మార్చి ఆ వీధిలో అందరికీ పుస్తకాలు సప్లైచేసి, సర్క్యులేట్‌చేసి ఆ వీధి మహిళా మండలిలో ఒక ఆప్తురాలిగా (వి ఐ. పిగా) తయారై పోయింది

అనుకోకుండా అనుకూలంగా జరిగిన ఈ 'గాలి' మార్పుడికి నా శ్రీమతికి మొదట్లో పరమ చచ్చు కొంపగా కనిపించిన మా కొత్త గొప్ప భవంతిలా కన్పించడం ప్రారంభించింది.

ఆమెలోని ఈ పరివర్తన గమనించక మామూలు ధోరణిలోనే కొంపలకోసం దుంపతెంపుకుంటున్న నన్నుద్దేశించి, ఒక శుభసమయాన మాయింటి గుణగణాలన్నీ స్తుతించి, అట్టి ఇంద్రభవనం సంపాదించిన నా తెలివితేటలను మెచ్చుకుని "ఇంక ఇళ్ళప్రయత్నం విరమించుకోండి'' అవి ఆదేశించింది

గృహాన్వేషణ జంజాటనలోపడి కొట్టుమిట్టాడు కుంటున్న నాకు ముక్తిప్రసాదించినదేవతగా "నా శ్రీమతిని మనస్సులో వేనోళ్ళ కొనయాడి నా తెలివితేటలను రికగ్నైజ్ చేసింది కనుక ఆ తరుణాన్ని వినియోగించుకుంటూ" అయితే యింత కాలం కాళ్లపడిపోయేలా నాచేత ఊరంతా సర్వేచేయించి నన్ను చివరికి 'ఫూల్‌వి' చేస్తావా?'' అన్నాను వెటకారంగా కొంచెం కోపం కూడా జోడించి.

''పోనీలెండి దానివల్ల నష్టమేమీలేదు సోమరిపోతు ఉద్యోగంచేస్తూ తిన్నది అరగక ఆపసోపాలు పడేవాళ్ళకి ఊరంతా తిరిగితే ఒళ్ళు గట్టిపడి ఆరోగ్యం బాగు పడుతుంది'' అని యిన్నాళ్ళ నా తిప్పటవి జస్టిఫైచేసింది.

''ఇప్పటికి నీకు జ్ఞానోదయం అయిందన్నమాట. ఏదోలా సరిపెట్టుకుంటుటూ

ఎడ్జస్ట్ మెంటాలిటీతో ఉండాలిగాని తప్పు లెన్నడం మొదలుపెడితే మన స్వంత యింటిలో కూడా ఉంటాయ్ అందుకని స్వంతయింటిని వదిలి వెళ్ళిపోతామా?" అంటూ లాజికల్‌గా ప్రశ్నించేను నా తెలివి తేటలకి నేనే మురిసిపోతూ

"మీ తెలివితేటలకి సంతోషించేంకాని. నోరు మూసుకోండి మీ లెక్చర్స్ నా దగ్గరకాదు స్వంతయింటికీ అద్దియింటికీ పోలికేమిటి? కొడుకు గుడ్డివాడయ్యేడుకదా అని వేలు దిమ్మరించి అల్లుణ్ణి కూడా గుడి వాణ్ణి తెచ్చుకుంటారా ఎవరైనా?'' అని ఒక చురక తగిలించింది. కుదేలైపోయేను. అందుకే ఏప్పుడూ ఆమె ముందు నా నోటిని చాలా అదుపులో పెట్టుకుంటాను. ఎప్పుడైనా సమయం దొరికిందా అని నా వాక్చాతుర్యం చూపబోతే యిలాగే శృంగ భంగం అవుతుంది

మరునాడు సాయంత్రం కాలేజీనుంచి ఇంటికొచ్చి. కుర్చీలో చతికిలబడి షూ, సైయీ విప్పుకుంటున్నాను.

రోజూ ఆ సమయానికి చేతిలో కాఫీతో ప్రత్యక్షమయ్యే శ్రీమతి చేతిలో కాఫీకి బదులు ఒక ఉత్తరం కనిపించి ఏమిటి?'' అన్నట్లు ప్రశ్నార్థకంగా ఆమెవంక చూసేను ముఖం పక్కకు తిప్పుకుని ఆ ఉత్తరం నా చేతిలో పెట్టింది. ఆతృతగా చదివేను,

"శ్రీ వెంకటేశ్వరరావుగారికి.

భానుమూర్తి అశీర్వదించి వ్రాయునది. భగవదనుగ్రహం వలన, తమవంటి శ్రేయోభిలాషుల ఆశీర్వచన ప్రభావంవలన తమకు ఒక శుభవార్త తెలియజేయుటకు ఆనందిస్తున్నాను

నా కుమార్తె శారదకు వివాహము నిశ్చయమైనది. మొన్ననే తాంబూలాలు పుచ్చుకున్నాము వివాహము రెండు నెల లలో జరుగవలసి ఉన్నది భగవంతుడు ప్రసాదించిన స్వగృహంలోనే జరుపుట సమంజసము కావున అన్యథా భావించక ఈ లోపుగా యిల్లు ఖాళీచేయగలరని ఆశించుచున్నాను

దరిమిలా శుభలేఖ పంపెదను. తమరు కుటుంబ సమేతంగా వచ్చి వధూ వరు లను ఆశీర్వదించవలసినదిగా కోరు తున్నాను. చి॥ సౌ॥ శాంతమ్మకు పిల్లలకు నా ఆశీస్సులు.

ఇట్లు
తమ శ్రేయోభిలాషి,
భానుమూర్తి

శ్రీమతిచ్చిన కాఫీనీళ్ళు గొంతుగుకలో పోకొసుని. కొత్త చెప్పుల జత కొను క్కుందుకు బజారుకి బయలుదేరేను •

---

ఓ సంగీత విద్వాంసుడు 'నిధి చాలా సుఖమా!' పాడటం ప్రారంభించగానే ఓ శ్రోత "నిద్ర మటుకు చాలా సుఖం" అంటూ ఒరిగిపోయాడు

—డి. ఉదయభాస్కర్, మద్రాస్.